

నేడు జీవీఎంసీ ఆవిర్భావ వేడుక

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ నిర్ణయించారు. ఈ మేరకు పాత కౌన్సిల్‌హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌లో అనకాపల్లి, భీమిలి మునిసిపాలిటీలను విలీనం చేసి 2005 నవంబరు 30న రాష్ట్ర ప్రభుత్వం జీవీఎంసీగా అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే.

రైతుల్లో గుబులు

తుఫాన్‌తో చేతికొచ్చిన పంట చేజారుతుందని ఆందోళన

- ఇప్పటికే సుమారు 30 శాతం మేర కోతలు పూర్తి
- అప్రమత్తం చేసిన వ్యవసాయాధికారులు



గొటివాడలో వరి పనలు కుప్ప పెడుతున్న రైతులు

సబ్బవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ రైతుల్లో గుబులు రేపుతోంది. చేతికొచ్చిన పంట ఎక్కడ నేలపాలవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు వరి పనలను కుప్పలుగా పెట్టారు.

మండలంలోని గొర్లివానిపాలెం, గుల్లేపల్లి, వంగలి, అంతకాపల్లి, రావలమ్మపాలెం, సబ్బవరం, అమృతపురం, అసకపల్లి, గొల్లలపాలెం, ఆరిపాక, టిక్కలిపాలెం, మొగలిపురం, మలునాయుడుపాలెం, తదితర గ్రామాల్లో రైతులు వారం రోజుల క్రితం వరి కోతలు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 25 నుంచి 30 శాతం మేర వరి కోతలు పూర్తయ్యాయి. అయితే గత మూడు రోజుల నుంచి దిత్వా తుఫాన్ హెచ్చరికలతో వ్యవసాయాధికారులు రైతులను అప్రమత్తం చేశారు. కోతలు పూర్తిగా నిలిపివేసి కోసిన వరి పనలను కుప్పలుగా పెట్టుకోవాలని సూచించడంతో పలు గ్రామాల్లో రైతులు పొలాల్లోనే కుప్పలు పెట్టేశారు. శనివారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం కావడంతో రైతులో ఆందోళన మొదలైంది. దీంతో తడి ఆరకుండానే శనివారం కొంత మంది కుప్పలు పెట్టడం కనిపించింది. ఆదివారం కూడా ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ఉరుకులు, పరుగులతో కుప్పలు పెట్టారు. కాగా రెండు రోజుల పాటు వరి కోతలు కోయవద్దని వ్యవసాయాధికారులు రైతులకు సమాచారం ఇచ్చారు.



పాతకృష్ణాదేవిపేటలో పొలంలోనే ఉంచిన కోసిన వరి పనలు

గొలుగొండ మండలంలో..

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, చోద్యం, గింజర్తి, కొంగసింగి, తదితర గ్రామాల్లో వరి పొలాల్లో కోసిన పనలు దర్శనమిస్తున్నాయి. వరి పొలాల్లో వరి పంట పండి కోత దశకు రావడంతో కొంత మంది రైతులు తుఫాన్‌ను కూడా లెక్క చేయకుండా కోతలు సాగిస్తున్నారు. తుఫాన్ వలన వర్షాలు కురిస్తే నష్టం తప్పదని ముందుగా కోసిన పనలను కొన్ని చోట్ల పొలం గట్లపై పెట్టుకోగా, మరికొన్ని చోట్ల పండిన వరి పనలు కోసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే కోసిన వరి పనలు పొలంలోనే ఉంచిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. ఆదివారం నర్సీపట్నం క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ తుఫాన్ చెన్నైని దాటుకొని రాష్ట్రం వైపు దూసుకు వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ఇటువంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోకూడదని అన్నారు. కోత కోసి కళ్లాలలో ఆరబెట్టిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఆరుబయట ఉన్న ధాన్యం కుప్పలపై టార్పాలిన్ పట్టాలు కప్పాలని, గాలికి పట్టాలు ఎగిరిపోకుండా రాళ్ల బరువు పెట్టాలని సూచించారు. పొలాల్లో నిలిచిన నీరు బయటకు పోయేందుకు దారి చేసుకోవాలన్నారు. పొలాల్లో నీరు నిల్వ ఉంటే పంట దెబ్బ తినే ప్రమాదం ఉందని సూచించారు. ఇంకా కోయని పంట ఉంటే వాతావరణం అనుకూలించే వరకు వాయిదా వేసుకోవాలని చెప్పారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికి అన్నదాతను ఆదుకోవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. వ్యవసాయ శాఖాధికారులు ఇచ్చిన సూచనలను తప్పక పాటించాలని రైతులకు సూచించారు.

చీడికాడలో..

చీడికాడ: తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయంనుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ముందుగా కోసిన వరి పనలను కళ్లాల్లోకి తీసుకువచ్చే పనిలో నిమగ్నమయ్యారు. కొంతమంది రైతులు ట్రాక్టర్లపైన, మరి కొంత మంది నెత్తిపైన మోసుకు వెళ్లారు. ఇంకొంత మంది పొలాల్లోనే చిన్నచిన్న కుప్పలు పెడుతున్నారు.



చీడికాడ మండలంలో పొలాల నుంచి వరిపనల మోపులను మోసుకు వెళుతున్న రైతులు

పర్యాటకుల సందడి

సందర్శనీయ స్థలాలు కిటకిట



పర్యాటకులతో కిటకిటలాడుతున్న చింతపల్లి మండలంలోని చెరువులవేనం వ్యూపాయింట్

గొలుగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. గొలుగొండ మండలంలోని దారమఠం పర్యాటక కేంద్రం వద్ద పర్యాటకుల కోలాహలం కనిపించింది. మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో గల దారమఠం ఉమాదారమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నిత్యం జలజలపారే జలపాతంలో స్నానాలు చేసి శివుడిని దర్శించుకున్నారు. ఇక్కడ అటవీ ప్రాంతం కావడంతో ఆహ్లాదకరంగా ఉండడంతో సాయంత్రం వరకు పర్యాటకులు సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం వనభోజనాలు చేశారు.

తీర ప్రాంతంలో..

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరాల్లో ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచి పర్యాటకుల ఇక్కడికి తరలివచ్చారు. తీరం సమీపంలో గల జీడిమామిడి తోటల్లో వన భోజనాలు చేశారు. పర్యాటక ప్రాంతంగా గుర్తింపు వున్నప్పటికీ ఇక్కడికి వచ్చే పర్యాటకులకు కనీస వసతులు అంతంత మాత్రమే ఉన్నాయి. దీంతో తీరానికి వచ్చే సందర్శకులకు అవస్థలు తప్పడం లేదు.

అల్లూరి జిల్లాలో..

పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సందర్శనీయ ప్రదేశాలకు ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి రైలు మార్గంలో అరకులోయకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు పర్యాటక సందడి నెలకొంది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయ ... మిగతా 4వ పేజీలో



గొలుగొండ మండలంలోని దారమఠం పర్యాటక కేంద్రం వద్ద పర్యాటకుల సందడి

నూకాంబిక ఆలయం కిటకిట

పోటెత్తిన భక్తులు





అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇటీవల జరిగిన శుభకార్యాల్లో భాగంగా పలువురు భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు వంటలు తయారు చేసుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు తగిన చర్యలు తీసుకున్నారు.

మానిపండు తెగులుతో కలవరం

వరి పంట చివరి దశలో ఉండగా వ్యాప్తి

- నల్లగా మాడిపోయి రాలిపోతున్న గింజలు
- గగ్గోలు పెడుతున్న రైతులు





మత్స్యపురంలో మానిపండు తెగులు సోకిన ఆర్‌జీఎల్ వరి (ఇన్‌సెట్‌లో) రావికమతం మండలంలో మానిపండు తెగులు సోకిన వరి

రావికమతం నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరి రైతులను మానిపండు తెగులు కలవరపెడుతోంది. మరో వారం, పది రోజుల వ్యవధిలో పండిన పంట చేతికి అందుతుందన్న గంపెడు ఆశతో ఉన్న రైతులను పంట చివర దశలో ఈ తెగులు ఆందోళనకు గురిచేస్తోంది. నిన్న, మొన్నటి వరకు పాము పొడ, పాచి, ఆకుమచ్చ, తదితర తెగుళ్లతో రైతులు సతమతమవుతుండగా, ఇప్పుడు మానిపండు తెగులు కంటతడి పెట్టిస్తోంది.



కొమిరలో వరి కంకులను చూపుతున్న రైతు ఈశ్వరరావు

మండలంలో ఈ ఏడాది మూడు వేల హెక్టార్లకు పైగా రైతులు ఖరీఫ్ వరిసాగు చేశారు. ఆకుపోతాల నుంచి వరినాట్లు, ఆపై పైరు ఆశాజనకంగానే రావడంతో పెద్దగా చీడ పీడలు కూడా లేకపోవడంతో రైతులు ఈ ఏడాది పంట దిగుబడి బాగానే వస్తుందన్న ఆనందంతో ఉన్నారు. పైరు పొట్ట దశ సమయం నుంచి పాము పొడ, పాచి, ఆకుమచ్చ తెగుళ్ల ఆశించడంతో వాటిని అధిగమించడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. మరో వారం, పది రోజుల వ్యవధిలో పంట కోతకు వస్తుందన్న తరుణంలో మానిపండు తెగులు ఆకస్మికంగా వరిపై వచ్చి గింజలు మసిబొగ్గులా మారిపోయి నేలరాలుతున్నాయి. దీంతో పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగుళ్లన్నీ ఒక్క ఆర్‌జీఎల్ రకానికే అధికంగా వస్తున్నాయని, అక్కడక్కడ సాంబా మసూరికి కూడా ఉందని రైతులు వాపోతున్నారు. గత రెండేళ్లుగా మానిపండు తెగులు అధికంగా వస్తున్నదని రైతులు అంటున్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఈ తెగులు ఉధృతంగా రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క తెగుళ్ల బెడద, మరో పక్క తుఫాన్ బెంగతో కంటి మీద కునుకు ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూత దశలోనే పురుగు మందు పిచికారీ చేయాలి

- ఎన్.రాజ్‌కుమార్, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్



వరిలో మానిపండు తెగులు వచ్చిన తరువాత పురుగు మందు పిచికారీ చేసినా ఫలితం ఉండదు. వరి పూతదశలో ఉండగా పురుగు మందు పిచికారీ చేస్తే మానిపండు తెగులు రాదు. ఈ తెగులు బాగా పండిన వరిలో అధిక శాతం కనిపిస్తుంది. వరి పొట్ట దశ నుంచి కంకులు పూర్తిగా వచ్చి గింజ కట్టే దశలో ముందు ఆకుపచ్చగా వచ్చి ఆపై పసుపు రంగులోకి మారి క్రమేపీ గింజలు మసిబొగ్గులా మారి రాలిపోతున్నాయి. ఈ తెగులు వచ్చిన వరి కంకులను ముందుగానే తొలగించాలి. లేకుంటే ఈ వ్యాప్తి చెందుతుంది. అలాగే రెల్లరాల్చు పురుగు వ్యాప్తిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి.

రైలు పట్టాలపై ప్రయాణికుల రాకపోకలకు చెక్

గూడ్స్ షెడ్డు వైపు ప్రహరీ గోడ నిర్మాణం

- ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని అధికారుల చర్యలు

అనకాపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో భాగంగా స్థానిక రైల్వే స్టేషన్‌లో పట్టాలపై ప్రయాణికులు రాకపోకలు సాగించకుండా రైల్వే అధికారులు చెక్ పెట్టారు. ముఖ్యంగా గూడ్స్ షెడ్డు వైపు భారీ ప్రహరీ గోడ నిర్మించారు. అంతేకాకుండా అత్యవసర సమయంలో తెరిచేందుకు గూడ్స్ షెడ్డు వద్ద రెండు, మూడు ప్లాట్‌ఫారాలకు వెళ్లే మార్గంలో గేటును కూడా ఏర్పాటు చేశారు. వాస్తవానికి రైలు పట్టాలపై రాకపోకలు సాగించకూడదని రైల్వే చట్టం చెబుతోంది. అందుకనే ప్రయాణికుల సౌకర్యార్థం గూడ్స్ షెడ్డు వైపు నాటి ఎంపీ అవంతి శ్రీనివాసరావు ... మిగతా 4వ పేజీలో



ఫుట్‌ఓవర్ బ్రిడ్జి



గూడ్స్ షెడ్డు వైపు ప్రహరీ గోడ నిర్మించిన దృశ్యం

ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

లంకెలపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 69వ అండర్- 14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి బాలుర, బాలికల విభాగంలో 26 జట్లు పాల్గొన్నాయి. లీగ్ దశ నుంచి 8 జట్లు చొప్పున ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. ఉత్కంఠభరితంగా సాగిన ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో నాలుగు జట్లు చొప్పున సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించి ఫైనల్స్‌లో తలపడ్డాయి. బాలుర విభాగం ఫైనల్స్‌లో విశాఖపట్నం, చిత్తూరు జిల్లా జట్ల మధ్య హోరాహోరిగా సాగిన పోరులో విశాఖపట్నం జట్టు విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో చిత్తూరు నిలిచింది. గుంటూరు జిల్లా జట్టుకు తృతీయ స్థానం దక్కింది. అలాగే బాలికల విభాగంలో ఫైనల్స్‌కు చేరిన చిత్తూరు, విశాఖపట్నం జట్ల మధ్య జరిగిన పోటీలో చిత్తూరు జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, విశాఖపట్నం ... మిగతా 4వ పేజీలో



ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖపట్నం బాలుర జట్టుతో డీఈవో అప్పారావునాయుడు, తదితరులు

యువత ఉపాధి కల్పనకు ప్రాధాన్యం

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాల్లో అంతర్జాతీయ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, యువత అన్ని రంగాల్లోనూ ప్రావీణ్యతను పెంపొందించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటితో పనిచేయాల్సి వస్తుందని, అందుకు అనుగుణంగా నైపుణ్యాలను అందింపుచ్చుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం యువత అభివృద్ధికి పోత్సాహాన్నిస్తోందన్నారు. అలాగే, ఈ జాబ్‌మేళాలో 18 పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు అర్హులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 315 మంది నిరుద్యోగులు హాజరుకాగా వీరిలో 151 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, ఎంపీడీఓ కొండలరావు, కూటమి నేతలు బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, కొఠారు శ్రీను, లాలం సోమునాయుడులు పాల్గొన్నారు.



మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఆధునిక సాహిత్యానికి ధ్రువతార గురజాడ


గురజాడ విగ్రహానికి పూలమాలలువేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక రచనలు చేసిన మహాకవి గురజాడ అప్పారావు ఆశయాలు అనుసరణీయమని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురజాడ 110 వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాకవి గురజాడ చేసిన సేవలు చారిత్రాత్మికమన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి ఆయన మార్గదర్శకులుని అన్నారు. గురజాడ వంటి మహనీయులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో సందీప్, ఎంపీడీఓ కొండలరావు, సీఐ ధనుంజయరావు, జనసేన నేతలు బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, కొఠారు శ్రీను, కొఠారు నరేశ్, లాలం సోమునాయుడు పాల్గొన్నారు.

యాదవుల సంఘ అభివృద్ధికి సమష్టి కృషి

▸▸ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాయకులు


యాదవ కార్పొరేషన్ డైరెక్టరు రంగనాయకులును సత్కరించిన ప్రతినిధులు

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యాదవ సంక్షేమ సంఘం అభివృద్ధికి సమష్టిగా ముందుకు సాగాలని యాదవ కార్పొరేషన్ డైరక్టరు దూలి రంగనాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఎలమంచిలిలో నియోజకవర్గస్థాయి యాదవ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా సంఘం అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు ఉన్న సంఖ్యాపరంగా ప్రతి ఆయా స్థానాల్లో యాదవులంతా పోటీ చేయాలన్నారు. జిల్లా సంఘం క్రియాశీలక సభ్యత్వాలు వేగవంతం చేయాలన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి అధ్యక్షులుగా దూలి రంగనాయకులు, ప్రధాన కార్యదర్శిగా వియ్యపు గోపి తదితరులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 4 మండలాలకు చెందిన అధక్ష, కార్యదర్శులతో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రంగనాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు భరిణికాన నరసింహమూర్తి, జడ్పీటీసీ సభ్యుడు దూళి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వియ్యపు సింహాచలం, కొన శంకరావు, ధూళి దేముళ్లు, వియ్యపు సత్తిబాబులు పాల్గొన్నారు.

ఐద్వా మండల కమిటీ ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన భూలక్ష్మి, మంగతాయారు

రాంబిల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపట్నం గ్రామంలో ఆదివారం ఐద్వా మండల అధ్యక్షురాలిగా సూరాడ భూలక్ష్మి, కార్యదర్శిగా సందక మంగతాయారు ఎన్నికయ్యారు. స్థానికంగా మండల కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐద్వా జిల్లా అధ్యక్షులుపి.మాణిక్యం మాట్లాడుతూ మండలంలో మద్యం, గంజాయి అధికంగా లభించడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దశలవారీగా మద్యాన్ని అరికడతామని హామీ ఇచ్చిన ప్రభుతవ్ం ఆ దశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలో గంజాయి, మత్తుపదార్థాల వాడకం పెరగడంతో మహిళలకు భద్రత కరువైందన్నారు. వీటిపై పోలీసులు దృష్టిసారించి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వానాయకులు నూకదేవి, దుర్గమ్మ, లక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి సీతారామ్ సేవలు మరువలేం


దాడి సీతారామ్‌కు నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు

మునగపాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాటక పరిషత్‌ల నిర్వాహణలతో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో దివంగత దాడి సీతారామ్ విశేష సేవలందించారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక యువజన మందిరం ఆవరణలో ఆదివారం సీతారామ్ సంతాపసభ నిర్వహించారు. సీతారాం యువజన మందిరం కోశాధికారిగా బాధ్యతలు నిర్వహించారన్నారు. ఆయనలేని లోటు సంస్థకు తీరనదని పలువురు చెప్పారు. సంస్థ అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బొడ్డేడ ప్రసాద్, పెంటకోట స్వామిసత్యనారాయణ, దాడి మునిలినాయుడు, టెక్కలి పరశురాం, ఆడారి గణపతి అచ్చింనాయుడు, టెక్కలి కొండలరావు, దాడి అరుణ్‌కుమార్, సీతారామ్ కుటుంబీకులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పేటతుల్లి వేడుక


తిమ్మరాజుపేటలో ఊరేగింపుగా వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

మునగపాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మరాజుపేటలో అయ్యప్పస్వామి పేటతుల్లి వేడుకలను ఆదివారం ఘటనంగా నిర్వహించారు. అయ్యప్ప మందిరం పీఠంలోని మాలధారులు అయ్యప్ప గీతాలు ఆలపిస్తూ పలు రకాల వేషధారణలతో నృత్యాలు చేస్తూ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నక్కపల్లి మండల కార్యవర్గం ఏకగ్రీవం


ప్రమాణ స్వీకారం చేస్తున్న యుటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గం

నక్కపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా గారా రాజబాబు, కళింగ సతీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నక్కపల్లిలో జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వెంకట్రావ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా డీఆర్‌కే శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, జిల్లా కౌన్సిలర్లుగా పి.వెంకట్రావ్, సత్యనారాయణమూర్తి, సత్యనారాయణ, జయనాయక్, జాకీర్ అలీ, నానాజీ, కిశోర్ శ్రీకాంత్, దేవానంద్‌రాజులను ఎన్నుకున్నారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మునగపాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉపకార వేతనానికి సంబంధించి ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష స్పందించే హృదయం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జడ్పీ హెస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ, ఈ పరీక్షను మునగపాకతో పాటు పరిసర మండలాలకు చెందిన 300 మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు. 180 మార్కులకుగాను వందకుపైగా మార్కులు పొందిన ఎన్.వివేక్, కొణతాల భావన్, టి.యశ్వంత్, వై.సంజ్ఞ, ఎస్.నాగచందు, టి.వైష్ణవి, ఎ.భవ్యశ్రీ, పి.రవికుమార్, వేదశ్య, ఎస్.యోషితలకు బహుమతులందించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్.తమ్మిరాజు, కె.వి.రమణ, ఉపాధ్యాయులు పి.సత్యనారాయణ, కె.సోమశేఖర్, ఎం.వి.అప్పారావు, పీలా జగదీష్, అచ్యుతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గీతాజయంతి వేడుకలు


తోటాడ ఓంకార పీఠం ఆవరణలో ట్రస్టు ప్రతినిధులు, చిన్నారులు

మునగపాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడ గ్రామంలో స్థానిక శ్రీఆదినారాయణస్వామి రాజయోగాశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మందిరం ఆవరణలో ఆదివారం బాలబాలికలు భగవద్గీత శ్లోకాలను పఠనం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టీ సూరిశెట్టి సుష్మన్నకుమార్ మాట్లాడుతూ ఓంకార పీఠంలో 26 నెలలుగా భగవద్గీత శ్లోకాల పఠనంపై శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటాట, గవర్ల అనకాపల్లి, టి.సిరసపల్లి, నారాయుడుపాలెంలకు చెందిన విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులే వినియోగించాలి


స్టిక్కర్లు విడుదల చేస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్, నాయకులు

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం స్వదేశీ జాగరణ కార్యక్రమం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడిరి ఆనంద్ స్థానిక నేతలతో కలిసి నిర్వహించారు. మనదేశంలో తయారైన వస్తువులను ప్రోత్సహించాలని ఆనంద్ ఈ సందర్భంగా కోరారు. దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెంపొందించుకునేందుకు అందుకు అనుగుణంగా స్వదేశీ వస్తువులకు ప్రతి ఒక్కరూ పోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా స్టిక్కర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈకార్యక్రమం కన్వీనర్ పప్పు ఈశ్వరరావు, బీజేపీ నేతలు ఆడారి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శూలాల మహోత్సవం


ఎలమంచిలి ధర్మవరంలో ఘటాలను ఊరేగిస్తున్న భవానీ భక్తులు

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ధర్మవరంలో శనివారం భవానీ భక్తులంతా కలిసి శూలాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకనకమహాలక్ష్మి భవానీ పీఠం ఆధ్వర్యంలో ఉదయం ఆలయ సమీపంలో భవానీలంతా కలిసి అమ్మవారి ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాయంత్రం శూలాల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి అనంతరం అగ్నిగుండం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గురు భవానీ కనక, చిన్ని, బాబూరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో పూర్వ విద్యార్థుల కలయిక


పాఠాలు చెప్పిన గురువును సన్మానిస్తున్న అధ్యక్షుడు అబద్ధం

ఎస్. రాయవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ఎస్.రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1992-1993 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం వెంకటాపురంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థి, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలవడంతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ముందుగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు తమకు పాఠాలు బోధించిన గురువులు హెచ్.అవతారం, కలిదండి సత్యనారాయణరాజులను ఘనంగా సత్కరించారు. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్కోజు ఆదిమూర్తి, శానాపతి రాము, కొప్పిశెట్టి సత్యనారాయణ, కర్రి అప్పారావు, గాలి గోవిందరావు, అలమండ రామాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం 2,335 మంది దరఖాస్తులు

కోటవురట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారం సాయంత్రంతో ముగిసిందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని 25 పంచాయతీల పరిధిలో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల మంజూరుకు 2,335 మంది దరఖాస్తులు చేసుకున్నట్టు చెప్పారు. అన్ని సచివాలయాల్లో వీటిని స్వీకరించామన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అం దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వివరించారు.

గ్రామాల్లో స్వామిత్వ పనుల పరిశీలన

ఎస్. రాయవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భీమవరం, పెదగుమ్ములూరు, కొరుప్రోలు పంచాయతీల్లో జరుగుతున్న స్వామిత్వ పనులను ఆదివారం డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు నాగమణి, నాగప్రభు, సర్వేయర్లు శ్రీనివాసరావు, సూజిన్, మౌనిక, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శి గురజాడ అప్పారావు

▸▸ ఎస్.రాయవరంలో జరిగిన వర్ధంతిలో వక్తలు


ఎస్.రాయవరంలో గురజాడ విగ్రహానికి గజమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు

ఎస్.రాయవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహాకవి గురజాడ అప్పారావు జన్మస్థలమైన ఎస్.రాయవరంలో ఆదివారం ఆయన వర్ధంతిని గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవితో పాటు వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తదితరులు గ్రామంలో ఉన్న గురజాడ అప్పారావు కాంస్య విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ మహాకవి గురజాడ రచనలు, పద్యాల ద్వారా దేశానికి అందించిన సేవలను కీర్తించారు. గురజాడ చూపిన దారిలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు సోమిరెడ్డి రాజు, మాజీ వైస్ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు, గురజాడ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో వరి పంటకు మేలు : ఏవో

నక్కపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు కురిస్తే కోత కోసిన వరి పంటను కనీస జాగ్రత్తలతో కాపాడుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి కె.ఉమా ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన పలువురు రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే కుప్పకోసి కుప్పలమీద ఉన్న ధాన్యాన్ని బరకాలు కప్పుకుని రక్షించుకోవాలని సూచించారు. నూర్చిన ధాన్యం రెండు, మూడు రోజుల్లో ఎండబెట్టడానికి వీలుకాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా ఒక క్వింటాల్ ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలపాలని సూచించారు. గింజ గట్టిపడే దశ నుంచి కోత దశలో పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలని సూచించారు. కోత కంకిలో మొలకలు కనబడితే నీరు బయటకు తీసివేసిన తరువాత ఐదు శాతం ఉప్పు ద్రావణం (50 గ్రాముల కళ్లు ఉప్పు లీటరు నీటిలో)కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

'భారత్ వికాస్ పరిషత్ సేవలు భేష్'



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్.విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దేశభక్తిని, ధర్మాన్ని పెంపొందించేందుకు భారత వికాస పరిషత్ చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో భారత్ వికాస్ పరిషత్ స్టేట్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ మనం అందరికంటే ముందుండాలన్న సూచన మంచిదేనని, కానీ అందుకు సరైన దారులపై అవగాహన కావాలని సూచించారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే విద్యపరంగా మనం ఇంకా వెనుకబడి ఉన్నామని, దీనిని అధిగమించేందుకు ఇంకా కృషి జరగాలన్నారు. అనంతరం సమావేశమైన భారత వికాస్ పరిషత్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు విశాఖ ప్రాంతంలో ఉన్న బీవీపీ శాఖల నివేదికలు, చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. బీవీపీ సౌత్ రీజియన్ కార్యదర్శి ధూళిపాల పురుషోత్తంశాస్త్రి, ప్రాంత అధ్యక్షులు జీబీవీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నారాయణ, తుని బ్రాంచి అధ క్షులు జి.వేణు గోపాలస్వామి,కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, కోశాధికారి ఎన్ఎన్. రాజబాబు, పేట్రన్ శివాజీ, వైస్ ప్రెసిడెంట్ ఎ.సత్యనారాయణ, ఆంజ నేయప్రసాద్, ఆకెళ్ల శాస్త్రి, జోసెఫ్, శివాజీ, సూర్యదేవుడు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణాల వనసమారాధన


ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న ట్రాఫిక్ ఎస్ఐ శేషగిరి, మాలతి

మునగపాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలని రాష్ట్ర శిష్టకరణాల సంఘం అధ్యక్షుడు అక్కుమహంతి రాజా కోరారు. మండలంలోని వెంకటాపురంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిష్టకరణాల అభివృద్ధికి ఐక్యంగా ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా సభ్యులు ఆట, పాటలతో అలరించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి ట్రాఫిక్ ఎస్ఐ శేషగిరి, మాలతి, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.ఎన్.పట్నాయక్, పక్కి రమేశ్, శేఖరమంత్రి శ్రీనివాస, సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యకర్త హత్యపై నిరసన


మాట్లాడుతున్న సీపీఎం నేత రాము

అచ్యుతాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణంలో పెంచలయ్యను దారుణంగా హత్య చేసిన గంజాయి బ్యాచ్‌ని కఠినంగా శిక్షించాలని సీపీఎం అచ్యుతాపురం కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నెల్లూరులో గంజాయి వంటి మత్తు పదార్థాలను నివారించాలని యువతను చైతన్య పరుస్తున్న కళాకారుడు, సీపీఎం కార్యకర్త కె. పెంచలయ్యను అతి దారుణంగా హత్యచేశారన్నారు. ఈ హంతకులు ఎటువంటి వారైనా పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేపల తాతలు, అంగరవి, చోడిపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ సత్యనారాయణ

రాంబిల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడివాడ మాజీ సర్పంచ్ నెట్టెం సత్యనారాయణ భార్య దివంగత నెట్టెం లక్ష్మి 6వ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం గామంలో పేదలకు చీరలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు దాచేపల్లి నర్సయ్యశెట్టి, పప్పల కోటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, నానాజీ, సాంబమూర్తి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి

... 3వ పేజీ తరువాయి

మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలవిహారి, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువువేనం మేఘాలకొండ, లంబసింగి, యర్రవరం జలపాతం తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు


ప్రథమ స్థానంలో నిలిచిన చిత్తూరు బాలికల జట్టు

... 3వ పేజీ తరువాయి

జట్టుకు ద్వితీయ స్థానం దక్కింది. తృతీయ స్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచింది. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్, మొల్లి ముత్యాలనాయుడు, డిప్యూటీ డీఈవో ఎం.అప్పారావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ నాగేశ్వరరావు, పీడీలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాలపై ప్రయాణికుల రాకపోకలకు చెక్


రైలు పట్టాలపై నడుస్తున్న ప్రయాణికులు (ఫైల్ ఫొటో)

... 3వ పేజీ తరువాయి

ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్లతో కాలినడక వంతెన ఏర్పాటు చేశారు. వంతెన పైనుంచే ప్రయాణికులు 2, 3 ప్లాట్‌ఫారాలకు రాకపోకలు సాగించాలని రైల్వే అధికారులు గూడ్స్ షెడ్డు వైపు స్టీల్ గడ్డర్లు వేసినా ప్రయాణికులు మాత్రం రైల్వే ట్రాక్ మీదుగానే ప్లాట్‌ఫారాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల గతంలో పలువురు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. వాస్తవానికి అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు అత్యధిక శాతం ప్రయాణికులు నాయిళ్ల వీధి మీదుగా గూడ్స్ షెడ్డు వైపు స్టేషన్‌కు చేరుకుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కాలినడక వంతెన ఏర్పాటు చేసినా సులువు మార్గమని పట్టాలు దాటుతున్నారే తప్ప వంతెన ఉపయోగించుకోవడం లేదు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అభివృద్ధి పనుల్లో భాగంగా 1వ నంబరు ప్లాట్‌ఫారం నుంచి గూడ్స్ షెడ్డు చివరి వరకు ప్రహరీ గోడ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

▸▸ శత చండీయాగ మహోత్సవంలో భాగంగా నిర్వహణ

▸▸ పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు



చండీమాతకు పూజలు జరుపుతున్న అర్చకులు

కొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణం గాంధీనగరంలో జరుగుతున్న శివ పంచాయతన సహిత శత చండీయాగ మహోత్సవంలో భాగంగా రెండో రోజు ఆదివారం సామూహిక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధానార్చకులు రేజేటి చక్రవర్తి, అర్చకులు రేజేటి కన్నబాబు, మారుతిలు పదిహేను హోమగుండాల్లో ముగ్గురు దంపతులతో యాగాన్ని జరిపించారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కుంకుమార్చనకు హాజరైన మహిళలు

ఆలయాలకు ఇన్వర్టర్‌లు, మైక్‌ల వితరణ



నాయకులకు సామగ్రిని అందజేస్తున్న విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాడి బీసీ కాలనీ, పెదతాడి గ్రామాల్లోని ఆలయాలకు రాంకీ ఫౌండేషన్ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా ఇన్వర్టర్‌లు, మైక్‌లు, స్పీకర్లు, సౌండ్ బాక్సులు సమకూర్చారు. వీటిని విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్షి చేతుల మీదగా ఆదివారం స్థానిక నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఫార్మాసిటీ, రాంకీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వాసిత గ్రామాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, స్థానిక నాయకులు కోమటి అచ్చిబాబు, కోమటి సూరిబాబు, బంతికోరు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటుకు కొనసాగుతున్న దీక్షలు

అనకాపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రైతుబజారు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక నెహ్రూచౌక్‌లో ఆమ్ ఆద్మీ నాయకులు రెండో రోజు ఆదివారం కూడా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ అనకాపల్లి నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు, నాయకులు వెంకటేశ్వరరావు, నారాయణరావులకు పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

టాలెంట్ టెస్టుతో పోటీ పరీక్షలపై అవగాహన



గౌరీ గ్రంథాలయంలో టాలెంట్ టెస్టుకు హాజరైన అభ్యర్థులు

అనకాపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోటీ పరీక్షలకు ముందు టాలెంట్ టెస్టులు రిహార్సల్స్ వంటివని ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర సహాయ కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. రైల్వే రిక్రూట్‌మెంటు బోర్డు, అసిస్టెంట్ లోకో పైలెట్ పోస్టులకు హాజరు కానున్న అభ్యర్థులకు ఆదివారం ఇక్కడి గౌరీ గ్రంథాలయంలో శ్రీధర్స్ సీసీఈ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులను ఉద్దేశించి వెంకటరమణ మాట్లాడారు. ఉద్యోగ సాధనలో అభ్యర్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి, పరీక్షల భయాన్ని పోగొట్టడానికి టాలెంట్ టెస్టు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్స్ సీసీఈ సమన్వయకర్త కె.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

వై.తునిలో కోడి పందాలాడుతున్న ముగ్గురి అరెస్టు

కశింకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏనుగు తుని గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్న ముగ్గురిని ఆదివారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.ఆరు వందల నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఈ దాడి చేశామన్నారు.

సబ్బవరం- దువ్వాడ రోడ్డుపై మురుగు ప్రవాహం

▸▸ దుర్గంధంతో జనం అవస్థలు ▸▸ చోద్యం చూస్తున్న అధికారులు



కొత్తూరు వద్ద సబ్బవరం- దువ్వాడ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

సబ్బవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం నుంచి దువ్వాడ, గాజువాక వెళ్లే ప్రధాన రహదారిపై గత కొన్ని రోజులుగా మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. గతంలో వెదుళ్లనరవ కొత్తూరు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు కాలువల ద్వారా దిగువకు వెళ్లేది. ప్రస్తుతం ఆ కాలువలన్నీ ఆక్రమణలకు గురికావడంతో మురుగు ఇలా రోడ్డుపైకి చేరి దిగువన ఉన్న ఇళ్లపైకి వెళుతోంది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనచోదకులతో పాటు స్థానికంగా నివాసం ఉంటున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడద అధికంగా ఉన్నట్టు వాపోతున్నారు. ఈ సమస్యపై అధికారులు తక్షణమే దృష్టిసారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

పరవాడ పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ ఎప్పుడో..?

▸▸ కలగా 30 పడకల ఆస్పత్రి అభివృద్ధి ▸▸ ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు



పరవాడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో గల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం అప్‌గ్రేడ్ అయ్యేది ఎప్పుడని పరవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో జనాభా సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. ఈ క్రమంలో పరవాడ పీహెచ్‌సీకి వెళ్లే రోగుల సంఖ్య అమాంతం పెరుగుతూ పోతుంది. అయితే ఇక్కడ వైద్య సేవలు ఏ మాత్రం సరిపోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఓ పక్క సింహాద్రి ఎన్టీపీసీ, మరో పక్క ఫార్మాసిటీ, సెజ్, ఇండస్ట్రీయల్ పార్కు ఉంది. ఆయా కర్మాగారాల్లో పనిచేసే ఎక్కువ శాతం మంది కార్మికులు ఇతర జిల్లాల నుంచి వలస వచ్చి పరవాడ, పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. వీరిలో ఎవరికైనా రోగం వస్తే నేరుగా స్థానిక పీహెచ్‌సీని ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ మాత్రం వైద్య సేవలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం, అగనంపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి వెళ్లాలంటూ రోగులను సిఫార్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి రోగుల ప్రాణాలు కూడా కోల్పోతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా పరవాడ పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కువగా రహదారి ప్రమాదాలతో పాటు ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిలో తీవ్రంగా గాయపడిన వారిని అనకాపల్లి, గాజువాక ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో క్షతగాత్రులు ప్రాణాలు విడిచిన సంఘటనలు లేకపోలేదు. ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వం దృష్టి సారించి పరవాడ పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని గత కొంత కాలంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు కోరుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి స్పందన కానరావడం లేదు. ప్రస్తుత జనాభాను దృష్టిలో పెట్టుకొని చూస్తే మండల వ్యాప్తంగా సుమారు లక్షా 20వేలకు పై గానే ఉన్నారు. వీరిలో 90 శాతం కార్మికులు, వ్యవసాయ కూలీలు, రోజువారీ పనులు చేసుకున్న వారే. వీరందరికీ పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీలు వైద్య సేవలు అందజేస్తున్నాయి. అయితే పూర్తిస్థాయిలో ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల పడాల్సి వస్తోంది. పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతంలో రోగుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని స్థానిక పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గొప్ప సాహితీ వేత్త గురజాడ



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత, సాంఘిక పరివర్తకు కృషి చేసిన మహా కవి గురజాడ అప్పారావు వర్ధంతిని ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక టిడ్కో కాలనీ వద్ద నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి ఐద్వా ప్రతినిధులు అన్నపూర్ణ, బంగారమ్మ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో గురజాడ ఒకరని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గురజాడ రచించిన కన్యా శుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు సీతమ్మ, వరలక్ష్మి, మంగమ్మ, కె.లక్ష్మి, రవణమ్మ, కనకమహాలక్ష్మి, వనజ, తదితరులు పాల్గొన్నారు.

‘సూర్యఘర్’ వైపు బయ్యవరం అడుగులు

▸▸ సౌర విద్యుత్ ఏర్పాటుకు 80 మంది ముందడుగు

▸▸ గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కొణతాల

▸▸ వీరికి రుణ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచన



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకానికి రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా ఎంపికైన బయ్యవరాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. ఈ తరుణంలో 80 మంది సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకోవడానికి స్వచ్ఛందగా ముందుకు వచ్చారన్నారు. బ్యాంకర్లతో అధికారులు మాట్లాడి వీరందరికీ రుణ సదుపాయం కల్పించి, అతి త్వరలోనే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కొణతాల సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాదరావు, ఈఈ రాజశేఖర్, డీఆర్‌డీఏ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాల పంపిణీ



మహిళకు మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సబ్బవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి మెరుగైన వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అందజేశారు. ఆదివారం క్యాంప్ కార్యాయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి ఇన్‌చార్జి గొర్లి రామునాయుడు, సబ్బవరం జనసేన పార్టీ అధ్యక్షుడు కర్రి కనకరాజు, సింగంపల్లి శ్రీను, గొర్లి నూకరాజు, దాట్ల మధు, రాపర్తి కృష్ణమోహన్, బైలపూడి హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సమాజానికి నిత్యావసరాల అందజేత



ప్రేమ సమాజానికి సరకులు అందిస్తున్న పీలా గోవింద, తదితరులు

కశింకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొక్కిరాపల్లి ప్రేమ సమాజానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను టీడీపీ నాయకులు అందజేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు వీటిని అందించారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ఓటమి ఎరుగని నాయకుడు గంటా శ్రీనివాసరావు అని పేర్కొన్నారు. అదే విధంగా పిల్లలకు దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్లు సిదిరెడ్డి శ్రీనివాసరావు, మజ్జి నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్‌లో ప్రతిభావంతులకు ప్రశంసలు



విద్యార్థులకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

కశింకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) మోడల్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులకు ఆదివారం ఇక్కడ బహుమతులను ప్రదానం చేశారు. స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో కశింకోట డీపీఎన్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ టెస్టుకు 295 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో మొదటి పది స్థానాల్లో నిలిచిన వారికి సంస్థ సభ్యులు ఎస్.రమేష్, డి.ఎస్.మల్లీశ్వరరావు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి నమూనా పరీక్షల వల్ల విద్యార్థుల్లో భయం పోయి, ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్ఎన్ స్వామి, వై.శ్రీనివాసరావు, యోగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుపై గందరగోళం తగదు

▸▸ సీపీఐ నేత వియ్యపు రాజు

తుమ్మపాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల స్థలాల మంజూరుపై లబ్ధిదారుల్లో గందరగోళం సృష్టించడం తగదని సీపీఐ మండల కార్యదర్శి వియ్యపు రాజు ఆరోపించారు. ఆదివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో అర్హులైన లబ్ధిదారులు పంచాయతీ కార్యా లయాలు చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. అధికారులు సైతం సరైన వివరణ ఇవ్వడం లేదన్నారు. ఇళ్ల స్థలాల మంజూరుపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు నియమ నిబంధనలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులుపై ఉందన్నారు.

బొజ్జన్న కొండపై పూర్వ విద్యార్థుల సందడి



బొజ్జన్న కొండ వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సబ్బవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బొజ్జన్న కొండ వద్ద సందడి చేశారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు బాదిరెడ్డి లక్ష్మణ, చినతల్లి, సీహెచ్. సత్యనారాయణ, రెడ్డి సనత, గండి శంకర రావు, దొగ్గ సత్యనారాయణ, అల్లు లక్ష్మి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అప్పన్న సేవలు

సింహాచలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవ స్థానంలో జరిగే అన్ని రకాల సేవలు ఇకపై ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని ఈఓ ఎన్. సుజాత తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దేవస్థానం పరిధిలో వసతుల సమాచారం, దర్శన వేళలు, ఆర్జిత సేవల వివరాలు, టికెట్ల లభ్యత, బుకింగ్, ప్రసాదాల టోకెన్ల విక్రయాలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచారు. దీనివల్ల భక్తులకు సమయం ఆదా కావడంతో పాటు కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణ సాధ్యపడనుంది. దర్శనాల టికెట్లను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక మార్గం ద్వారా ప్రవేశం కల్పించనున్నారు. ఆన్‌లైన్ టికెట్లను www.aptemples.ap.gov.in. అనే వెబ్‌సైట్ ద్వారా లేదా 'మన మిత్ర' వాట్సాప్ నంబరు 9552 300009 ద్వారా పొందవచ్చు. అలాగే ఆర్జిత సేవలు, అన్నప్రసాద విరాళాలు, శాశ్వత పూజలు, గో సంరక్షణ, తదితర పథకాలకు విరాళాలను క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు యూపీఐ ద్వారా కూడా చెల్లించవచ్చు.

కనక మహాలక్ష్మి దేవాలయం సేవలు కూడా..

మహారాణిపేట : వన్‌టౌన్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కూడా దర్శనాలు, అభిషేకాలు, ప్రసాదాలు, తదితర సేవలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ముఖ్యంగా మార్గశిర మాసోత్సవాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా ఈ ఏర్పాట్లు చేశామన్నారు. దర్శనాలు, అభిషేకాలు, ఇతర అన్ని రకాల సేవలు ఆన్‌లైన్ ద్వారా లభిస్తాయని చెప్పారు.

అలరించిన గానామృతం

అనకాపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి పాటనైనా అలవోకగా పాడుతూ ప్రేక్షకులను అలరిస్తున్న మెలోడీస్ బ్రదర్స్ గానం అమృతం అని మాజీ ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల వివేకానంద ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన మెలోడీస్ బ్రదర్స్ కిశోర్ కుమార్ మెగా మ్యూజికల్ లైవ్ షోలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం కిశోర్ కుమార్ పాడిన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, వ్యాపార వేత్త బుద్ధ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరినాగు హతం



గ్రామస్థుల చేతిలో హతమైన గిరినాగు

కొయ్యూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరులో సుమారు 13 అడుగుల పొడవైన గిరినాగు గ్రామస్థుల చేతిలో హతమైంది. శనివారం మధ్యాహ్నం గ్రామానికి ఆనుకుని ఉన్న కొండపై నుంచి గిరినాగు గ్రామంలో ఎం. దొరబాబు అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించింది. కుటుంబ సభ్యులు వంటపాత్రల నుంచి శబ్దం రావడంతో వెళ్లి చూస్తే గిరినాగు కనిపించింది. గ్రామస్థులు సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి ఇంటి బయటకు పామును తీసుకువచ్చారు. అనంతరం దానిని హతమార్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

'బైరి నరేష్‌ను విడుదల చేయాలి'



నిరసన తెలుపుతున్న ఎంఎన్‌ఎస్ సంఘ సభ్యులు

పాడేరురూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్. బైరి నరేష్‌ను తక్షణమే విడుదల చేయాలని జిల్లా ఎంఎన్‌ఎస్ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. సామాజిక సంస్కర్త నరేష్ తెలంగాణలోని గద్వాల్‌లో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు వెళ్లారు. ఆయన స్నేహితుని ఇంటిలో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో అతనిని అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. నరేష్‌ను ఎక్కడ ఉంచారన్న విషయం కోసం పోలీసులు స్పష్టం చేయకపోవడం దారుణమన్నారు. అతనిని తక్షణమే విడుదల చేయాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌ఎస్ జిల్లా సంఘం నాయకులు కె.రాంబాబు, టి.వసంతకుమారి, ఎం.చిన్నయ్య, జి.దయారావు, కె.అచ్చిబాబు, ప్రసాదరావు, సీహెచ్.ఝాన్సీరాణి, కె.సృజన పాల్గొన్నారు.

పంప్డ్ స్టోరేజీ ఎస్ఈకు సన్మానం



పదవీ విరమణ చేసిన ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి దంపతులకు సన్మానిస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 30 , (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ఏపీ జెన్‌కో పంప్డ్ స్టోరేజీ సూపరింటెండెంట్ ఇంజనీర్, సీలేరు కాంప్లెక్సు ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డిని ఆదివారం ఏపీ జెన్‌కో విద్యుత్‌సౌధ (విజయవాడ) చీఫ్ ఇంజనీర్ (సివిల్) రవీంద్ర రెడ్డి, ఎస్ఈ (సివిల్) శ్రీనివాసరెడ్డి ఈఈ రత్నకుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి దంపతులనుఇంటి వద్ద నుంచి సన్మాన సభ వరకు స్థానిక జెన్‌కో ఇంజనీరు, ఉద్యోగులు పూలు జల్లుతూ ఘనంగా ఆహ్వానం పలికారు. అనంతరం చంద్రశేఖర్ దంపతులను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ముఖ్య అతిథిగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ పంప్డ్ స్టోరేజీ మొదటి స్టేజ్ , ఎన్విరాల్‌మెంట్ అనుమతులు రావడానికి చంద్రశేఖర్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన పట్టుదల, ఏకాగ్రత, నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన అధికారి అని అభినందించారు. స్థాని క ఏఈఈ సురేష్ మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డి ఎంతో స్నేహ భావంతో మెలుగుతూ అందరితో కలిసిపోయే వారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎస్ఈ లు ఉమామహేశ్వరరావు, రామభద్రరాజు, అరుణ్‌కుమార్, ఈవీవీ సత్యనారాయణ, రిటైర్డు ఎస్ఈ రమణమూర్తి, ఈఈ కావూరి శ్రీనివాసరావు, సర్పంచ్ పి.దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, జెన్‌కో ఇంజనీర్లు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

ఇంటిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి: సర్పంచ్



మాట్లాడుతున్న సర్పంచ్ దురియా పుష్పలత

చింతపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇంటిపన్ను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ఆదివారం పంచాయతీ సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 3,600 గృహాలు ఉన్నాయన్నారు. ప్రతి గృహానికి ఇంటి పన్ను డిమాండ్ నోటీసులు అందజేశామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఇంటి పన్ను చెల్లించాలన్నారు. ఇంటి పన్ను వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. గృహాలు కలిగిన ప్రతి ఒకరు ఆధార్, మొబైల్ నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాన్నారు. గృహాల్లో చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకుని తడి, పొడి చెత్తను భద్రపర్చి పంచాయతీ సిబ్బందికి అప్పగించాలన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి ముక్కలి వెంకటరావు, గుమస్తా అంబేడ్కర్ పాల్గొన్నారు.

నేడు శ్రావణ్, దొన్నుదొర దముకు పర్యటన

అనంతగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండిబ పంచాయతీ దముకు గ్రామంలోని సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జీసీసీ చైర్మెన్ కిడారి శ్రావణ్‌కుమార్, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర పాల్గొంటున్నారని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సోవేరి సుబ్బారావు, గాలి నరేంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కోరారు.



మాదిమళ్ళులో బురదమయంగా ఉన్న రోడ్డు



శిథిలమైన ఎంపీపీ పాఠశాల భవనం

వర్షం వస్తే బురదమయం

- పాఠశాలలోకి నీరు
- మాదిమళ్లు గ్రామంలో దుస్థితి
- అస్తవ్యస్తంగా మారిన రోడ్లతో అవస్థలు

సీలేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధి మాదిమళ్ళ గ్రామంలోని ఎంపీపీ పాఠశాల భవనం చిన్నపాటి వర్షం కురిసినా శ్లాబ్ కారిపోయి లోనికి నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అలాగే, గ్రామ వీధుల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో సమస్యగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామం అంతా బురదమయంగా మారింది. వర్షాలు తగ్గినా ఇంకా తడి వాతావాతావరణమే నెలకొంది.

దీంతో వివిధ రోగాల బారిన పడుతున్నామని గ్రామానికి చెందిన పెసా అధ్యక్షుడు కొయిలంగి నాగేశ్వరరావు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి తమ గ్రామానికి సీసీ రోడ్డును మంజూరు చేయడంతోపాటుపాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని ఈ సందర్భంగా వారు కోరారు.

'హౌసింగ్ లబ్ధిదారుల నుంచి అక్రమ వసూలు'



జియో టాగ్‌కు అక్రమ వసూలు చేస్తున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వాలుగూడెం వాసులు

కొయ్యూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్మన్ పథకంలో గృహాల మంజూరుకు వీలుగా చేపట్టిన జియో ట్యాగింగ్‌కు రూ. 500 చొప్పున లబ్ధిదారుల నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ అక్రమ వసూలు చేస్తుండడంపై కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు మఠంభీమవరం పం చాయతీ వాలుగూడెం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పెద్దపాంగి వీరన్నతో పాటు గోపాల్, చంద్రరావు, అప్పన్న అప్పలరాజు తదితరులు అందచేసిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పంచాయతీలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా అదనపు బాధ్యతలు చేపడుతున్న పద్మనాభం జియోట్యాగ్ చేయకుంటే గృహాలు మంజూరు కావని ఇందుకు రూ. 500 ఇవ్వాలని కోరుతున్నారన్నారు. ఈ విషయంపై మఠంభీమవరం పంచాయతీ కార్యదర్శికు ఫిర్యాదు చేయడంతో వెల్ఫేర్ లబ్ధిదారులపై దురుసుగా ప్రవర్తించటమే కాకుండా దుర్భాషలకు పాల్పడున్నారన్నారు. ఈ విషయాన్ని వాట్సాప్ ద్వారా ఎంపీడీవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఆయన విచారణ చేపతామని కనీస చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో శనివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్‌చేశారు. ఈ విషయమై ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా, రానున్న రెండు రోజుల వ్యవధిలో గ్రామానికి వెళ్ళి విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయక అవస్థలు



ముంచంగిపుట్టు వాలుగు రోడ్ల కూడలి సమీపంలో దుకాణం పక్కన పేరుకున్న చెత్త

ముంచంగిపుట్టు, న వంబరు 30, (ఆం ధ్ర జ్యోతి): మండల కేం ద్రంలోని దుకాణాల ముందు వ్యాపారులు విధిగా డెస్ట్‌బిన్‌లు ఏ ర్పాటు చేయాలని, లేకుంటే జరిమానా విధిస్తామని పంచాయతీ కార్యదర్శ సింహాచలం హెచ్చరించారు. ఆది వారం పలు దుకాణాల వద్ద పేరుకుపోయిన చె త్తను తొలంచారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదనిఅన్నారు. కొంత మంది వ్యాపారులకు ఎన్ని సార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని, దీని వల్ల పరిశుభ్రత లోపించి, పలు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని అన్నారు. మండల కేంద్రంలో పరిశుభ్రమైన వాతావరణం కోసం వ్యాపారులు తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

7న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

పాడేరురూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్)కు అల్లూరి జిల్లా నుంచి 726 మంది విద్యార్థులు దరఖాస్తు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ తెలిపారు. డిసెంబరు 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, వీఆర్.పురం, చింతూరుల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. హాల్ టిక్కెట్‌లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్, పాఠశాల లాగిన్‌లో, మనమిత్ర వాట్సాప్‌లో అందుబాటులో ఉంచామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్ ఉపయోగించి తమ పాఠశాలకు సంబంధించిన హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.

రోడ్డు మధ్య గోతులతో భయం..భయం

- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

ముంచంగిపుట్టు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గం మధ్యలో గల చోటాముక్కిపుట్టు సమీపంలో కల్వర్టు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గతుకులమయంగా మారింది. అయినా, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదనే చెప్పాలి. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నాన్నారు. ఆ ప్రదేశంలో గత రెండేళ్ల క్రితమే భారీ వర్షాలకు పలు చోట్ల రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. వాటి మరమ్మత్తుపనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం అవి మరింత పెద్దవిగా రూపాంతరం చెందాయి. తరచూ ఆ ప్రదేశంలో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిపన పడుతున్నారు. ఇప్పటికే పలువురు ఆసుపత్రి పాలయ్యారు. ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాలకు చెందిన వాహనాలు ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరు రాష్ట్రాలకు ఇదే ప్రధాన రహదారయినా, అధికారులు దాని బాగోగులపై దృష్టిసారించక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులు స్పందించి రహదారి మరమ్మతు పనులు జరిగే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



చోటాముక్కిపుట్టు వద్ద గోతులు

ముగిసిన ఉపాధ్యాయుల క్రీడా పోటీలు



త్రోబాల్ విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులతో ఎంఈవో జాన్ తదితరులు

పాడేరురూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు విజయవంతంగా ముగి సినట్టు ఎంఈవో మోరి జాన్, స్కూల్ గ్రేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పి.సూరిబాబు తెలిపారు. శనివారం పురుష ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రికెట్ పోటీలో తలారిసింగి పాఠశాల హెచ్ఎం టి.నాగేశ్వరరావు టీమ్ ప్రతిభను చూపి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఆదివారం నిర్వహించిన మహిళా ఉపాధ్యాయుల త్రోబాల్ క్రీడా పోటీలో కరణం సూర్యకుమారి టీమ్ విజేతలుగా నిలిచినట్టు చెప్పారు. ఈ పోటీల్లో సూర్యకుమారి, వి.శకుంతల, వి.లక్ష్మి, కె.కుమారి, కె.ఈశ్వరి, కె.శారద పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే డ్రస్‌లు పంపిణీ

పాడేరురూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరాటేలో శిక్షణ పొందుతున్న స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థినులకు కరాటే డ్రస్సులు పంపిణీ చేసినట్టు పాండు కరాటే అకాడమీ చీఫ్ ఇనస్ట్రక్టర్ బాకూరు పాండురాజు తెలిపారు. శిక్షణ సమయంలో ప్రతిభ చూపుతున్న వారిని గుర్తించి వారికి తమ ఇనిస్టిట్యూట్ నుంచి యూనిఫారాలను సమకూర్చి కళాశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశామన్నారు. అత్యంత ప్రతిభను చూపుతున్న 10 మంది విద్యార్థినులను జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌నకు తరలించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ నిర్మల, కరాటే ఇన్‌స్ట్రక్టర్ వెంకట్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గొప్ప సాహితీ వేత్త గురజాడ

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత, సాంఘిక పరివర్తకు కృషి చేసిన మహా కవి గురజాడ అప్పారావు వర్ధంతిని ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక టిడ్కో కాలనీ వద్ద నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఐద్వా ప్రతినిధులు అన్నపూర్ణ, బంగారమ్మ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీ కారుల్లో గురజాడ ఒకరని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గురజాడ రచించిన కన్యా శుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు సీతమ్మ, వరలక్ష్మి, మంగమ్మ, కె.లక్ష్మి, రవణ మ్మ, వనజ, పాల్గొన్నారు.

అధ్వానంగా వారపు సంత రోడ్డు

ముంచంగిపుట్టు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంతకు వెళ్లే దారి అధ్వానంగా మారడంతో వ్యాపారులు, గిరిజనులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక చెరువు సమీపంలో ఉన్న ప్రధాన రహదారికి కొద్ది దూరంలో సంత నిర్వహిస్తుంటారు. ఈ సంతకు వెళ్లే కాలిబాట మొత్తం బురదమయంగా మారడంతో పాటు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. చెత్త, మురుగునీటి నిల్వలు పేరుకుపోయాయి. దీంతో అడుగు వేయలేని పరిస్థితి. ప్ర స్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ మార్గం మరీ దయనీయంగా మారింది. అటుగా సంతకు వెళ్లేందుకు వినియోగదారులు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో మహిళలు పిల్లలు, లగేజీలతో వెళ్లే క్రమంలో జారి పడిన సంఘటనలు సైతం ఉన్నాయి. కానీ, అధికారులు కనీస దృష్టి సారించకపోవడంపై విమర్శలు నెలకొంటున్నారు. ఇకనైనా స్పందించి ప్రధాన రహదారి నుంచి సంత ప్రాంగణం వరకు సీసీ రోడ్డు పనులు జరిగే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ముంచంగిపుట్టు సంతకు వెళ్లే రహదారి ఇదే

హెచ్ఐవీ మృతులకు నివాళి



పాడేరులో కొవ్వొత్తుల ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

పాడేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బంది ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా హెచ్ఐవీ, లెప్రసీ అధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి హెచ్ఐవీ మృతులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో పి.సింహాచలం, డీఎండీవో ఎస్.చిరంజీవి, ప్రోగ్రామ్ మేనేజర్ రామచందర్, ఆరోగ్య విస్తరణాధికారులు జి.సింహాద్రి, కె.సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం రేపు



పాలక వర్గ సమావేశంలో మాట్లాడుతున్న ధర్మకర్త సుబ్బారావు

పాడేరురూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని పూర్ణపుష్కల అయ్యప్ప స్వామి ఆలయ 33వ వార్షికోత్సవాన్ని ఈనెల 2వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో పాలకవర్గ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్షికోత్సవానికి భక్తులు, ఉద్యోగులు, వ్యాపారులు 5వేల మందికిపైగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉ న్న వినాయక, అయ్యప్పస్వామి, మహాలక్ష్మి, సుబ్రహ్మణేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, సోమనాథేశ్వరస్వామి, సాయిబాబా, సరస్వతీదేవి, వాసవీమాత, నాగదేవత విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆలయ ప్ర ధాన అర్చకులు ప్రవీణ్ శర్మ, ఆలయ కమిటీ సెక్రటరీ రొబ్బి రాము, ఇమిడిశెట్టి అనీల్, కోశాధికారి ఎ.ఆదిత్య, దామోదర్, ప్రచార కార్యదర్శులు వర్మ సత్తిబాబురాజు, వెయ్యాకుల శ్రీనివాస్, ప్రకాష్, సీతారాం, అశోక్ పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా బీఎస్ఎన్ఎల్ టవర్

- సిగ్నల్స్‌లేక పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ గ్రామాల గిరిజనులకు ఇబ్బందులు



పిల్లిగెడ్డలో ఏడాది క్రితం ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ టవర్

సీలేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏడాది క్రితం ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ టవ ర్ నేటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంపై పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ గ్రామాల గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాట్రగెడ్డలో గత ఏడాది ఈ టవర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. దీంతో కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ, ఎస్. నేరేడుపల్లి తదితర గ్రామాల్లో సరిగా సెల్ సిగ్నల్స్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీ మారుమూల గ్రామానికి కూడా సెల్ టవర్లను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొచ్చిన బీఎస్ఎన్ఎల్ అధికారులు కాట్రగెడ్డలో నిర్మించినటవర్‌ను సంవత్సరం గడుస్తున్నా ఎందుకు వినియోగంలోకి తీసుకురావడంలేదని దుప్పులవాడ మాజీ సర్పంచ్ గోపాలరావు అధి కారులను ప్రశ్నిస్తున్నారు. కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ గ్రా మాలకు ప్రస్తుతం సీలేరు బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ అరకొరగా వస్తోందని, దాని వలన నెట్‌వర్క్ సరిగ్గా లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి కాట్రగెడ్డ గ్రామంలోని బీఎస్ ఎన్ఎల్ టవర్ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ గోపాలరావు, ఆ గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

పర్యాటకుల సందడి

... 3వ పేజీ తరువాయి

మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలవిహారి, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువువేనం మేఘాలకొండ, లంబసింగి, యర్రవరం జలపాతం తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

... 3వ పేజీ తరువాయి

జట్టుకు ద్వితీయ స్థానం దక్కింది. తృతీయ స్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచింది. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్,



ప్రథమ స్థానంలో నిలిచిన చిత్తూరు బాలికల జట్టు

మొల్లి ముత్యాలనాయుడు, డిప్యూటీ డీఈవో ఎం.అప్పారావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ నాగేశ్వరరావు, పీడీలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై ప్రయాణికుల రాకపోకలకు చెక్

... 3వ పేజీ తరువాయి

ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్లతో కాలినడక వంతెన ఏర్పాటు చేశారు. వంతెన



రైలు పట్టాలపైనుంచి వెళ్తున్న ప్రయాణికులు (ఫైల్‌ఫొటో)

పైనుంచే ప్రయాణికులు 2, 3 ప్లాట్‌ఫారాలకు రాకపోకలు సాగించాలని రైల్వే అధికారులు గూడ్స్ షెడ్డు వైపు స్టీల్ గడ్డర్లు వేసినా ప్రయాణికులు మాత్రం రైల్వే ట్రాక్ మీదుగానే ప్లాట్‌ఫారాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల గతంలో పలువురు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. వాస్తవానికి అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు అత్యధిక శాతం ప్రయాణికులు నాయిళ్ల వీధి మీదుగా గూడ్స్ షెడ్డు వైపు స్టేషన్‌కు చేరుకుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కాలినడక వంతెన ఏర్పాటు చేసినా సులువు మార్గమని పట్టాలు దాటుతున్నారే తప్ప వంతెన ఉపయోగించుకోవడం లేదు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అభివృద్ధి పనుల్లో భాగంగా 1వ నంబరు ప్లాట్‌ఫారం నుంచి గూడ్స్ షెడ్డు చివరి వరకు ప్రహరీ గోడ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేశారు.

ప్రధాన రహదారుల్లో తు(తి)ప్పలు..!

అసలే ఎక్కడికక్కడ గతుకులు.. ఆపై ఏపుగా పెరిగిన తుప్పలు.. రోడ్లకు ఇరువైపులా కమ్మేసిన పిచ్చి మొక్కలు.. వీటికితోడు హెచ్చరిక బోర్డులు కూడా లేని మలుపులు.. వెరసి మాడుగుల మండలంలోని ప్రధాన రహదారులు ప్రమాదకరంగా పరిణమించాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

ఇరువైపులా పిచ్చి మొక్కలు.. వాహన చోదకుల బెంబేలు

కేజే.పురం, దబ్బగుంట, గొటివాడ, వీరనారాయణం, మాడుగుల ఘాట్ రహదారుల్లో పొంచివున్న ప్రమాదం


కేజే పురం-దబ్బగుంట రోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఉన్న తుప్పలు


కేజే పురం-దబ్బగుంట రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మరో మలుపు


మాడుగుల ఘాట్ రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, పిచ్చి మొక్కలు

మాడుగుల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుచోట్ల ఆర్అండ్బీ రహదారుల్లోని మలుపులతో ప్రమాదం పొంచి ఉంది. దీనికితోడు రహదారులకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, పిచ్చి మొక్కలతో వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. కేజే.పురం-దబ్బగుంట, వీరనారాయణం-గొటివాడ అగ్రహారంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే ఆర్అండ్బీ రహదారుల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రహదారులను కప్పేస్తున్నాయి. వీటివల్ల ఆయా మార్గాల్లో ప్రమాదకర మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురవుతామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఆయా మార్గాల్లో ప్రయాణించడం మరింత కష్టతరంగా ఉందని వాపోయారు.

మాడుగుల ఘాట్ రోడ్డులో...

మాడుగుల నుంచి ఘాట్ రోడ్డు మార్గంలో కాకుల చెరువు వద్ద తుప్పలు దట్టంగా కమ్మేశాయి. చెరువు వద్ద కల్వర్టు ఉండగా, దానిపై నిర్మించిన మదుములు శిథిలమయ్యాయి. దీనికితోడు రక్షణ గోడలు కూడా లేవు. ఫలితంగా ఈ మార్గంలో ప్రమాదం పొంచివుంది. రోడ్డును తుప్పలు మూసేయడంతో ఎదురెదురు వాహనాలు దగ్గరకు వస్తేగాని కనిపించడం లేదు. దీనికితోడు వాహనాలు తప్పించుకునేందుకు అవకాశం లేకపోతోంది. పగటి వేళల్లో కంటే రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. అయినప్పటికీ ఆర్అండ్బీ అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రధాన రహదారుల్లో తక్షణమే జంగిల్ క్లియరెన్స్ చేయాలని, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టణ సీఐగా గఫూర్ బాధ్యతలు


స్పీకర్ అయ్యన్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ గఫూర్

నర్సీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ సీఐగా ఎస్కే.గఫూర్ ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన 2015 నుంచి 2016 వరకు నర్సీపట్నం రూరల్ సీఐగా పనిచేశారు. బదిలీపై వెళుతున్న సీఐ గోవిందరావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఎస్ఐలు ఉమామహేశ్వరరావు, రమేశ్, సిబ్బంది గఫూర్‌ను కలిసి స్వాగతం పలికారు. అనంతరం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును సీఐ గఫూర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రత పరిరక్షణ కృషి చేయాలని, నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా సీఐకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు.

విలువల పెంపులో సుపథ సేవలు భేష్

▸▸ మండల విద్యా శాఖాధికారి నాగేంద్ర


ప్రతిభా పరీక్షలలో భగవద్గీత శ్లోకాలు చెప్పిన విద్యార్థులు

నర్సీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భావి తరాలకు విలువలు అందించేందుకే సుపథ సంస్థ ప్రయత్నిస్తున్నదని మండల విద్యా శాఖాధికారి నాగేంద్ర చెప్పారు. ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి)లో సుపథ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్లోక పఠనం, పద్య పఠనం, వ్యాస రచన, దేశభక్తి గీతాలు తదితర అంశాలపై విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను పుస్తకాలకు పరిమితం చేయకుండా నైతిక విలువలు కూడా నేర్పించడం చాలా అవసరమన్నారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయలు, మాతృ భాష, విలువలను భావి తరాలకు అందించేందుకు సుపథ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. బలిఘట్టం పాకలపాటి గురువు ఆశ్రమ నిర్వాహకులు వైవీ రమణ మాస్టారు మాట్లాడుతూ సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు యూవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో గత 21 సంవత్సరాలలో 18 కేంద్రాల పరిధిలో 50 వేల మంది విద్యార్థులను తయారు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అల్లు అప్పారావు, బాబీ మాస్టారు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా పాత చెరువు

▸▸ విచ్చలవిడిగా వ్యర్థాల పారేయడంపై స్థానికుల ఆందోళన


చెరువు స్థలంలో ఇళ్ల వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న ట్రాక్టర్

చోడవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న పాత చెరువులో వ్యర్థాలు పారబోస్తూ, చెరువును డంపింగ్ యార్డులా మార్చివేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడచిన మూడు రోజులుగా ఇళ్లను తొలగించిన వ్యర్థాలు గుట్టలుగా పోస్తూ చెరువును కప్పేస్తున్నారు. చెరువులో వ్యర్థాలు పారబోయడంపై అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని, చెరువును కాపావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ చెరువు ఆక్రమణలు గురికాకుండా కాపాడాలంటూ హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ, దానిని పట్టించుకోకుండా వ్యర్థాలతో కప్పివేసే చర్యలకు పాల్పడడాన్ని ఆయన తప్పుపట్టారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ చెరువు పూడ్చివేత పనులకు అడ్డుకట్ట వేయాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.

ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక


ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రతినిధులు

నర్సీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రాయల్ రిసార్ట్‌లో సంఘం గౌరవ అధ్యక్షులు గణపతిరాజు బంగార్రాజు ఆధ్వర్యంలో ఆదివారం కార్యవర్గం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి 150 మంది ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బంగార్రాజు (అనకాపల్లి), కార్యదర్శిగా గోవిందరాజు (నర్సీపట్నం), కోశాధికారిగా రామకృష్ణ (కె.కోటపాడు) ఎన్నికయ్యారని నర్సీపట్నం ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకరాజు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా


వేములపూడిలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న సీఐ రేవతమ్మ

నర్సీపట్నం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్రోన్‌తో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని రూరల్ సీఐ రేవతమ్మ తెలిపారు. మండలంలోని వేములపూడి గ్రామంలో ఆదివారం డ్రోన్ ఎగర వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూదం, పేకాట, కోడి పందేలు, గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎరకన్నపాలెం, బంగారయ్యపేట గ్రామ శివార్లలో పేకాట నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడులు చేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

▸▸ ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి సుశాంత్ మిశ్రా


సమావేశంలో మాట్లాడుతున్న సుశాంత్ మిశ్రా

నర్సీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి సుశాంత్ మిశ్రా సూచించారు. నర్సీపట్నం కృష్ణా పేలస్‌లో ఆదివారం కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అట్టడుగుల వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నదన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం పార్లమెంట్ నియోజవర్గంలోని పలు గ్రామాలలో పర్యటిస్తున్నామన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం రాహుల్‌గాంధీ జోడో పాదయాత్ర చేశారని చెప్పారు. ఆయనకు పదవీ వ్యామోహం, వ్యక్తిగత స్వలాభం లేదని, పేద ప్రజల కోసం పని చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, నాయకులు బోడా వెంకట్, ఎం.సురేశ్, రుత్తల శ్రీరామమూర్తి, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలో రెండు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈఈ కర్రి శంకరరావు ఆదివారం తెలిపారు. కొత్తపెంట, ములకలాపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

▸▸ రహదారిపై విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు


కారుపై కూలిపోయిన విద్యుత్ స్తంభం

బుచ్చెయ్యపేట నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంతాపురం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఓ కారు ఢీకొంది. దీంతో స్తంభం కారుపై పండి. కారు నుజ్జునుజ్జయింది. అయితే కారులో ఉన్న భార్యాభర్తలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారు కారును విడిచిపెట్టి వెళ్లిపోయారు. విద్యుత్ వైర్లు తెగకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఏమాత్రం తీగలు తెగిపడినా పెద్ద ప్రమాదం జరిగేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులను వివరణ కోరగా, తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తాం

దేవరాపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తామని టీడీపీ మారేపల్లి గ్రామ అధ్యక్షుడు కిల్లి గోవింద అన్నారు. గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ కమిటీల ఎన్నికలు ఆదివారం జరిగాయి. గ్రామ శాఖ అధ్యక్షుడిగా గోవిందతో పాటు సభ్యులుగా నెక్కెళ్ల శ్రీనివాసరావు, పి.అప్పారావు, కిల్లి సన్యాసినాయుడును ఎన్నుకున్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని ఈ సందర్భంగా గోవింద పేర్కొన్నారు.

వైసీపీ చీడికాడ అధ్యక్షుడిగా మహేశ్

చీడికాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ చీడికాడ గ్రామ అధ్యక్షుడిగా పరవాడ మహేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ సీనియర్ నేత పరవాడ అప్పారావు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. పార్టీ నేతలు సిమెంట్ నాయుడు, పి.ప్రసాద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ


మోదకొండమ్మ ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు... (ఇన్‌సెట్‌లో) పూజలు అందుకున్న అమ్మవారు

మాడుగుల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మోదకొండమ్మ ఘటాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. నూకాలమ్మ ఆలయానికి 50, మరిడిమాంబకు 50, మోదకొండమ్మ అమ్మవారికి 50 ఘటాలను సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

చిత్రలేఖన పోటీల్లో బాలలకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో చిత్రకారుడు

చోడవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చైన్నెలో మూడు రోజుల క్రితం నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో స్థానిక చిత్రకళా నిలయానికి చెందిన చోడవరం, మాడుగులలోని ఎనిమిది మంది బాలలు పతకాలు సాధించారు. మాడుగులకు చెందిన పుట్టా రోహిత్, ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన బి.స్వజిత్, వర్షిణి, బి.జనని బంగారు పతకాలు సాధించారు. జె.యజ్ఞ ప్రవల్లిక, శామ్యూల్, శ్రీహర్షిత, జి.వర్షిని రజత పతకాలు సాధించగా, మరో తొమ్మిది మందికి కన్సొలేషన్ బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా చిత్రకళా నిలయం వ్యవస్థాపకులు బి.సూర్యనారాయణ విద్యార్థులను అభినందించారు.

పోలీసు మైత్రీ క్రీడా మైదానం ప్రారంభం


మైదానంలో క్రీడకారులతో మాట్లాడుతున్న ఎస్ఐ

నాతవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసు మైత్రీ క్రీడా మైదానాన్ని ఎస్ఐ తారకేశ్వర రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతవరం గ్రామం మధ్యలోని ఎకరం స్థలంలో ఫారెస్టు గ్రౌండ్‌ను క్రీడాకారులకు అనువుగా ఉండేందుకు తీర్చిదిద్దామని చెప్పారు. ఇక నుంచి ఈ మైదానంలో క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఉదయం నడవడానికి అనువుగా ట్రాక్ ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శెట్టి గోపీ, పోలిరెడ్డి రాజు, శెట్టి లోవ, ఇటంశెట్టి బాబీ, పినిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

వరి కోతలు నిలిపివేయండి

గొలుగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కోతలు నిలిపి వేయాలని వ్యవసాయాధికారిణి సుధావాణి తెలిపారు. గుండుపాల, పాతమల్లంపేట, అమ్మపేట, కొత్తమల్లంపేట, పాకలపాడు, ఏటిగైరంపేట గ్రామాల్లో వరి పంట కోత దశకు చేరినట్టు గుర్తించామన్నారు. తుఫాను కారణంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో వరి కోతలను రైతులు విరమించుకోవాలని సూచించారు. అలాగే వరి పొలాల్లో నీరు అధికంగా ఉంటే వెంటనే తొలగించాలని ఆమె తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు సంఘటితంగా పనిచేయాలి

చోడవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాల సాధనకు దళితులు సంఘటితంగా పనిచేయాలని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ వ్యవస్థాపకులు పీవీ సునీల్‌కుమార్ కోరారు. గాంధీగ్రామంలోని సిటిజ్ కాలనీలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ దళితులకు కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత దళితులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాల్తేటి పెంటారావు, రవిసిద్ధార్థ, డాక్టర్ పీవీ.రమేశ్, ఎన్.దేముడు, సియ్యాద్రి శ్రీనివాసరావు, సూరిబాబు, శ్రీను, త్రినాథ్, గోపి పాల్గొన్నారు.

కాపు వన సమారాధన వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తాతయ్యబాబు, నాయకులు

బుచ్చెయ్యపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాపు వన సమారాధన వాల్‌పోస్టర్లను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 14న చోడవరంలో నిర్వహించనున్న కాపు వన సమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆకుల రమేశ్, సిద్దాబత్తుల నాని, సిహెచ్.శ్రీను, రాము, బీజేపీ మండల కార్యదర్శి నానాజీ, నాయకులు దొండా రమేశ్, తలారి శంకర్, సాయం శేషు, సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్యానికి ధ్రువతార గురజాడ

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక రచనలు చేసిన మహాకవి గురజాడ అప్పారావు ఆశయాలు అనుసరణీయమని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురజాడ 110 వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాకవి గురజాడ చేసిన సేవలు చారిత్రాత్మకమన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి ఆయన మార్గదర్శకులన్నారు. గురజాడ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో సందీప్, ఎంపీడీవో కొండలరావు, సీఐ ధనుంజయరావు, జనసేన నేతలు బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, కొఠారు శ్రీను, కె.నరేశ్, సోమునాయుడు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో అప్పన్న సేవలు

సింహాచలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవ స్థానంలో జరిగే అన్ని రకాల సేవలు ఇకపై ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని ఈఓ ఎన్.సుజాత తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దేవస్థానం పరిధిలో వసతుల సమాచారం, దర్శన వేళలు, ఆర్జిత సేవల వివరాలు, టికెట్ల లభ్యత, బుకింగ్, ప్రసాదాల టోకెన్ల విక్రయాలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచారు.

దీనివల్ల భక్తులకు సమయం ఆదా కావడంతో పాటు కౌంటర్ల వద్ద రద్దీ నియంత్రణ సాధ్యపడనుంది. దర్శనాల టికెట్లను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక మార్గం ద్వారా ప్రవేశం కల్పించనున్నారు. ఆన్‌లైన్ టికెట్లను www.aptemples.ap.gov.in. అనే వెబ్‌సైట్ ద్వారా లేదా 'మన మిత్ర' వాట్సాప్ నంబరు 9552300009 ద్వారా పొందవచ్చు.

అలాగే ఆర్జిత సేవలు, అన్నప్రసాద విరాళాలు, శాశ్వత పూజలు, గో సంరక్షణ, తదితర పథకాలకు విరాళాలను క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు యూపీఐ ద్వారా కూడా చెల్లించవచ్చు.

కనక మహాలక్ష్మి దేవాలయం సేవలు కూడా..

మహారాణిపేట : వన్‌టౌన్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కూడా దర్శనాలు, అభిషేకాలు, ప్రసాదాలు, తదితర సేవలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ముఖ్యంగా మార్గశిర మాసోత్సవాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా ఈ ఏర్పాట్లు చేశామన్నారు. దర్శనాలు, అభిషేకాలు, ఇతర అన్ని రకాల సేవలు ఆన్‌లైన్ ద్వారా లభిస్తాయని చెప్పారు.